భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం, జూన్ 22: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఈపీ ఆపరేటర్లకు 'ఏ' గ్రేడ్ ఉద్యోగోన్నతుల పత్రాలు అందజేత

మణుగూరు టౌన్, జూన్ 22: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధిస్తూ ఏరియాను అగ్రభాగాన నిలబెడుతున్న ఏరియా కార్మికుల ఉజ్వల భవిష్యత్తు కోసం యాజమాన్యం బంగారు బాటలు వేయడం అభినందనీయమని ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈపీ ఆపరేటర్లకు ఏ గ్రేడ్ ఉద్యోగోన్నతి పత్రాలు సకాలంలో అందించాలని, ఇటీవల టీబీజీకేఎస్ చేసిన విజ్ఞప్తి మేరకు యాజమాన్యం స్పందించి ఏరియాలో 13మంది ఈపీ ఆపరేటర్లకు ఏ గ్రేడ్ ఉద్యోగోన్నతి పత్రాలు అందజేయడం సంతోషకరమన్నారు. ఉద్యోగోన్నతి పత్రాలు పొందిన ఈపీ ఆపరేటర్లకు అభినందించారు.

బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు రూరల్, జూన్ 22: బీటెక్ కోర్సుల కోసం ఏరియా అధికారులు, ఉద్యోగుల వారసులు దరఖాస్తులు చేసుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మంథని, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కేయూ కొత్తగూడెంలో బీటెక్ కోర్సులు ఉన్నాయన్నారు. మంథనిలో అధికారుల పిల్లలకు 18 సీట్లు , ఉద్యోగుల పిల్లలకు 18 సీట్లు, కేయూ కొత్తగూడెంలో అధికారులు, ఉద్యోగుల పిల్లలకు 10 సీట్లు కేటాయించారన్నారు. జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మంథనిలో మైనింగ్‌లో 3/3, సివిల్‌లో 3/3, మెకానికల్‌లో 3/3, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 3/3, కంప్యూటర్ సైన్స్‌లో 3/3 సీట్లు ఉన్నాయన్నారు. కేయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కొత్తగూడెంలో మైనింగ్ ఇంజినీరింగ్ 2, కంప్యూటర్ సైన్స్‌లో 2, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఐటీలో 2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 2, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో 2 సీట్లను కేటాయించారన్నారు. దరఖాస్తు చేసుకునే విదార్యర్థులు తెలంగాణ రాష్ట్రం నిర్వహించిన 2025-26 ఎప్‌సెట్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తులో హాల్‌టికెట్ నెంబర్, ర్యాంక్‌ను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తులో సెట్ మెరిట్, కులధృవీకరణ పత్రం, లోకల్ ఏరియా సర్టిఫికెట్ జిరాక్స్ కాపీని జతపర్చాలన్నారు. కౌన్సిలింగ్ సమయంలో ఉద్యోగి ఐడీ కార్డు, ఎంపికైన అభ్యర్థి ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపు గని డిపార్ట్‌మెంట్ అధికారికి అందజేయాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

బూర్గంపహాడ్, జూన్ 22ః బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1988-90 ఇంటర్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు నలజాల వెంకటరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. 35 ఏళ్ల తర్వాత వీరి అపూర్వ కలయిక ఉల్లాసాన్ని కలిగించింది. ఉదయం కళాశాలలో సరస్వతి మాతకు పూలమాల వేశారు. ఈ బ్యాచ్‌లో పూర్వ విద్యార్థుల సమాచారాన్ని సేకరించి పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. నాటి గురువులను సత్కరించి సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థి సంఘం నాయకులు నలజాల వెంకట్రావు, తోట కోటేశ్వరరావు, రెడ్డెం నర్సింహారెడ్డి, ఉమామహేశ్వరరావు, రామ్‌లాల్, రామారావు, వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బొగ్గు రవాణాకు ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోయగూడెం ఓసీ పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ ప్రాజెక్ట్,ప్లానింగ్ ఆఫీసర్

టేకులపల్లి, జూన్ 22: కోయగూడెం ఓసీలో బోగ్గు ఉత్పత్తి రవాణాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని కేవోసీ సింగరేణి డైరెక్టర్స్ ప్రాజెక్ట్, ప్లానింగ్ ఆఫీసర్ కే వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం మండలంలోని కోయగూడెం ఓసీలో పర్యటించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా ఓబీ బ్లాస్టింగ్ లోడింగ్ పనులను జీఎం ఆర్ కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు నాణ్యత సామర్థ్యం పెంచే జీ 13 బొగ్గు ఉత్పత్తి అయ్యేలా చూడాలని, గనుల్లో ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి తీయాలని అన్నారు. కార్యక్రమంలో కోయగూడెం పీవో గోవిందరావు, మేనేజర్ శ్రీనివాస్, క్వాలీటి మేనేజర్ రాందాస్, ఏరియా సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి తరగతి మిత్రుల చేయూత

టేకులపల్లి, జూన్ 22: మండలంలోని దాస్‌తండా పంచాయతీ లచ్చతండా గ్రామానికి చెందిన బానోత్ మంగీలాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంగీలాల్‌తో కలిసి 2000లో టెన్త్ చదివిన స్నేహితులు ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

చేయీ చేయీ కలిపారు.. గ్రామాన్ని శుభ్రం చేశారు

శ్రమదానం చేస్తున్న రామన్నగూడెం గ్రామస్తులు, సీసీ రహదారికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్న ప్రజలు

- రామన్నగూడెం ప్రజల శ్రమదానం
- పల్లెల్లో పారిశుధ్యాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- పంచాయతీకి నిధుల్లేవ్.. సిబ్బందికి వేతనాల్లేవ్
- గ్రామస్తులే రంగంలోకి దిగుతున్నవైనం

అశ్వారావుపేట రూరల్, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పల్లెల పరిస్థితి అధ్వాన్నంగా తయ్యారైంది. పంచాయతీలకు నిధులు లేవు.. పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు సైతం ప్రభుత్వం సరిగా ఇవ్వడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. అసలే వానకాలం వ్యాధులు విజృంభించే సమయం కావడంతో పల్లెజనమంతా ఆందోళన చెందుతున్నారు. అయితే ఆ ఊరు ప్రజలు మాత్రం ఎవరికోసమో ఎదురుచూడలేదు. మన ఊరిని మనమే బాగు చేసుకుందాం అనుకున్నారు. అంతే తడువుగా రంగంలోకి దిగి తమ గ్రామాన్ని మొత్తం శుభ్రం చేసుకున్నారు. ఆదివారం అశ్వారావుపేట మండలంలోని రామన్నగూడెం గ్రామస్తులు చేయి చేయి కలిపి గ్రామాన్ని శుభ్రపర్చుకున్నారు. మాజీ సర్పంచ్ మడకం స్వరూప, పీసా గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు మడకం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. పల్లె ప్రకృతివనాన్ని శుభ్రంగా చేశారు. రహదారులకు ఇరువైపులా పెరిగిన చెత్త, మురికినీరు నిల్వలు లేకుండా చేశారు. ప్రస్తుతం రెండు పంచాయతీలకు ఒక్కరే కార్యదర్శి కావటం వల్ల గ్రామంలో అపరిశుభ్రత వల్ల వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా గ్రామాన్ని శుభ్రం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఈ గ్రామం పరిశుభ్రతలో బెస్ట్ అవార్డును అందుకోవడం గమనార్హం.

ఆర్థికసాయం అందజేత

ఆర్థికసాయం అందజేస్తున్న కబ్బాకుల రవి

ఇల్లెందు రూరల్, జూన్ 22: మండలంలోని మామిడిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన కల్తి కిషోర్ మూత్రాశయ సమస్యతో బాధపడుతున్నారన్నాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.6.50లక్షలు ఖర్చుచేసి చికిత్స చేయించుకున్నాడన్నాడు. విషయం తెలుసుకున్న ఆదివాసీ హెల్ప్‌లైన్ వ్యవస్థాపకుడు కబ్బాకుల రవి రూ.10 వేలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ హెల్ప్‌లైన్ ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ చాపల రమేశ్, జాయింట్ సెక్రటరీ కొడెం కృష్ణ, సభ్యులు ఆరెం రవికుమార్, పాయం రవికుమార్, పూనెం రవి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం, జూన్ 22ః ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.18వేల చెక్కును పట్టణంలోని శిల్పినగర్‌కు చెందిన ఎస్.రహీమకు భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బాధితులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నిరుపేదలు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి నవాబ్, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

మణుగూరుటౌన్: మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అశ్వారావుపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

మణుగూరు టౌన్, జూన్ 22: విధినిర్వహణలో ఉండే కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మణుగూరు దుర్గా ఓసీ కంపెనీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి ఉపయోగించడం, వాటిని కలిగి ఉండటం కూడా నేరమే అని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మిమ్మల్ని ప్రలోభపెడితే అలాంటి వాటికి లొంగకూడదని, ఇవి మనిషి మెదడుపై, శరీరంపై, సమాజంపై దుష్ప్రభావాన్ని చూపుతాయని అన్నారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ నాగబాబు, ఎస్సై ప్రసాద్, ట్రైనీ ఎస్సై మనీషా, ఓసీ మేనేజర్ ముత్తు కుమార్, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

అశ్వారావుపేట, జూన్ 22: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ నాగరాజు కోరారు. డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) విక్రయం-వినియోగమనేది తీవ్ర నేరం కిందకు వస్తుందని చెప్పారు. ఈ నేరాల్లో చిక్కుకుంటే జీవితమే నాశనమవుతుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో బాగంగా స్థానిక బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి సమాజంలో డ్రగ్స్ వినియోగం ప్రమాదకర సమస్యగా మారిందని సీఐ ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ విక్రయం-వినియోగంతో కలిగే నష్టాలు, సంబంధిత చట్టాలు, కేసులను వివరించారు. ఎస్సైలు యయాతి రాజు, అఖిల తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీలో వివాదం

సింగభూపాలెం చెరువు (ఫైల్)

కొత్తగూడెం టౌన్, జూన్ 22: జిల్లాలో పేరెన్నిక గల సింగభూపాలెం చెరువు మత్స్యకారుల సొసైటీలో వివాదం ఏర్పడింది. ప్రధానంగా చేప పిల్లల పంపిణీ, సభ్యత్వాల జారీ, ఆదాయ-వ్యయాలు, నిధుల నిర్వహణ తదితరాంశాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ చెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నిర్వహణ కమిటీ గత ఐదేళ్లుగా అమల్లో ఉంది. ఇందులో మొత్తం 11 మంది కార్యవర్గ సభ్యులుగా, సాధారణ సభ్యులుగా మరో 400 మంది పైచిలుకు ఉన్నారు. కమిటీ కాల పరిమితి రెండు నెలల క్రితమే ముగిసింది. అయినప్పటికీ పాత కమిటీ పెత్తనమే సాగుతున్నదని కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు టర్నోవర్ ఏడాదిక సుమారు కోటి రూపాయ పైనే ఉంటుందని అంచనా. సొసైటీ ఆదాయ వ్యయాలపై, చేప పిల్లల కొనుగోలుపై ఇటీవల చెరువు సమీపంలో జరిగిన సమావేశంలో కొందరు సభ్యులు (పాత కమిటీపై) అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదాయ వ్యయాలు సరిగా చెప్పడం లేదని ఆరోపించారు. కొత్త కమిటీని ఏర్పాటు చేసి, సభ్యులందరికీ వారి వాటా ప్రకారంగా ఆదాయాన్ని పంచాలని, చేప పిల్లల కొనుగోలులో అక్రమాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. దీనిపై సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులను 'నమస్తే' వివరణ కోరగా... ''సమావేశం వాడీవేడిగా జరిగిన మాట వాస్తవమే'' అని అన్నారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలి

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా

అశ్వాపురం, జూన్ 22: సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో వ్యవసాయ భూములకు సాగునీరు అందించాకే బయటకు తరలించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం అశ్వాపురంలో ఎడెల్లి శ్రీను, రాయపూడి రాజేష్, తెల్లం వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే కమ్యూనిస్టులపై నరేంద్రమోదీ, అమిత్‌షా కక్ష కట్టి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, పలువురు మావోల ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయవిచారణకు ఆదేశించాలన్నారు. ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం సమంజసం కాదని ఇది శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సల్స్‌ను అంతమొందిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరీ ఎన్‌కౌంటర్లు చేస్తుండటం, మరోపక్క తాము శాంతిచర్చలకు సిద్ధమని మావోలు ప్రకటిస్తున్నా పట్టించుకోకపోవడంలో ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి పంచాయతీలో సీపీఐ ప్రాతినిధ్యం ఉండేలా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్, నాయకులు పుల్లారెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీకుమారి, వేల్పుల మల్లికార్జున్, సురేశ్, శేఖర్, సురేందర్‌రెడ్డి, ప్రసాద్, రాజేశ్, పవన్, సాయి, సురేశ్, నాగేంద్రబాబు, నాగేశ్, కమలాకర్, చెలికాని శ్రీనివాస్, వెంకన్న, లింగయ్య, జయమ్మ, అచ్చమ్మ, నాగమణి పాల్గొన్నారు.

నివాస గృహాలను క్రమబద్ధీకరణ చేయాలి

మాట్లాడుతున్న మడత వెంకటగౌడ్

ఇల్లెందు, జూన్ 22: ఇల్లెందు పట్టణంలో నివాస గృహాలు, వ్యాపార గృహాలను క్రమబద్ధీకరించాలని ఇల్లెందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకటగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మడత వెంకటగౌడ్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇల్లెందు ప్రాంతంలో బొగ్గు గనుల తవ్వకాల ప్రారంభమైన నాటి నుంచి నివాస గృహాలు క్రమబద్ధీకరణకు నోచుకోక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో 2017సంవత్సరంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో 8వేలకు పైగా నివాస గృహాలు, కమర్షియల్ గృహాలు రెగ్యులేషన్ కోసం అనుమతించారన్నారు. అప్పుడు కొంతమంది దరఖాస్తులు చేసుకోగా మరికొంతమంది దరఖాస్తు చేసుకోలేదన్నారు. మరొక్కసారి పట్టణంలో గృహాలను క్రమబద్ధీకరించాలని అన్నారు. కార్యక్రమంలో బాణాల శ్రీనివాస్, శనిగారపు రమేశ్, మామిడి శివకుమార్, రవీందర్, సతీశ్, నాగేశ్, మున్నాఫ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మావోయిస్టుతోపాటు మరొకరి హత్య

బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల దుశ్చర్య!

కొత్తగూడెం ప్రగతిమైదాన్, జూన్ 20: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు మరో దుశ్చర్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బీజాపూర్ జిల్లాలో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెంద్రబోర్, యమపూర్ గ్రామాలకు చెందిన ఇద్దర యువకులను శనివారం అర్ధరాత్రి సాయుధంగా వచ్చిన మావోయిస్టులు అపహరించారు. అనంతరం వారిని సమీప ప్రాంతంలో ప్రజాకోర్టు నిర్వహించి అతి దారుణంగా హత్య చేశారు. మృతులో ఒకరు ఇటీవల బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయిన మాజీ మావోయిస్టు సమ్మయ్య కావడం విశేషం. మరో వ్యక్తి యమపూర్‌కి చెందిన వేకో దేవే. వీరిద్దరూ మావోయిస్టు పార్టీకి సంబంధించిన కీలక సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పామేడ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాగా గడిచిన వారంరోజుల వ్యవధిలో ఇప్పటివరకు మావోయిస్టులు పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో ఐదుగురిని హత్య చేశారు. ఈ నెల 17వ తేదీన బీజాపూర్ జిల్లా పెద్ద కొర్మ గ్రామానికి చెందిన ముగ్గురిని పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేసిన విషయం విదితమే. ఇందులో ఒకరు పాఠశాలకు వెళ్తున్న 13ఏండ్ల బాలుడు కాగా, మరొకరు 20 ఏళ్ల యువకుడు ఉన్నాడు. అందులోనూ వీరు కూడా లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యుడు దినేష్ మోడియం బంధువులు కావడం కొసమెరుపు. లొంగిపోయిన మావోయిస్టులు, వారి కుటుంబీకులనే ఆ పార్టీ టార్గెట్ చేయడంపై సర్వత్రా చర్చలు వెల్లువెత్తుతున్నాయి.

నల్ల బెల్లం, పటిక పట్టివేత

పాల్వంచ, జూన్ 22: 10 లీటర్ల నాటు సారాతో పాటు నాటు సారా తయారీకి ఉపయోగించే 4025 కేజీల నల్ల బెల్లం, 20 కేజీల పటికతోపాటు బొలేరో వాహనాన్ని ఆదివారం పాల్వంచలోని దమ్మపేట సెంటర్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ హరిరావు, సిబ్బంది పట్టుకున్నారు. ఆ వాహనంలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు.

కత్తితో దాడి.. వ్యక్తి మృతి

పర్ణశాల, జూన్ 22: మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన సవలం మల్లేష్ (35), సవలం నాగేశ్వరరావుకు కొంత కాలంగా భూమి సరిహద్దు విషయం లో గొడవలు జరుగుతున్నాయి. వీరిద్దరూ సొంత అన్నదమ్ముల పిల్లలు. ఈ క్రమంలో శనివారం సవలం నాగేశ్వరరావు వరుసకు అన్న అయిన మల్లేష్‌ను కత్తితో దాడి చేయగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మల్లేష్ భార్య అలివేలు ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలం, జూన్ 22: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ జరుగుతుందని ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందజేయాలని కోరారు.

నేడు 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, జూన్ 22: ఈ నెల 23న (సోమవారం) కలెక్టరేట్‌లో 'ప్రజావాణి' ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

నేడు, రేపు సీపీఎం శిక్షణ తరగతులు

భద్రాచలం, జూన్ 22: భద్రాచలం సీపీఎం పట్టణ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు సోమ, మంగళవారాల్లో బండారు రామచందర్‌రావు భవన్ సీపీఎం కార్యాలయంలో జరుగుతాయని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 'పార్టీ విశిష్టత అఖిలభారత మహాసభల రాజకీయ తీర్మానం' అంశంపై రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేశ్ బోధిస్తారని, మధ్యాహ్నం 'పార్టీ నిర్మాణం, పని పద్ధతులు'పై జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు బోధిస్తారన్నారు. మంగళవారం 'మతోన్మాదం, వివిధ తరగతులపై ప్రభావం' అంశంపై రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్, 'సోషల్ మీడియా ప్రాధాన్యత, కర్తవ్యాలు'పై జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా రమేశ్ బోధిస్తారని పేర్కొన్నారు. పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజాసంఘాల బాధ్యులు తరగతులకు హాజరై జయప్రదం చేయాలన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై శిబిరాలు

అశ్వారావుపేట రూరల్, జూన్ 22: కేంద్ర ప్రభుత్వ పథకాలపై కొండరెడ్ల గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావడిగుండ్ల పంచాయతీ గోగులపూడి గ్రామంలో సోమవారం శిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

ఒంటరి మహిళకు ఆర్థిక సాయం

అశ్వారావుపేట, జూన్ 22: పట్టణానికి చెందిన ఒంటరి మహిళ జగదీశ్వరి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఆమె వైద్య ఖర్చులకు వాసవీ క్లబ్ రీజనల్ చైర్మన్ భోగవల్లి రాంబాబు, మండల అధ్యక్షుడు సత్యవరపు బాలగంగాధర్ తిలక్ కలిసి రూ.10వేలతోపాటు, బియ్యం, నిత్యావసర సరుకులు సమకూర్చారు. వీటిని ఆమెకు ఎస్సై యయాతి రాజు ఆదివారం అందించారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జూన్ 22: విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గందం మల్లికార్జున్‌రావు, నాగుల రవికుమార్, వంగా రవిశంకర్, పూనెం మురళి, హరికృష్ణ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

ములకలపల్లి, జూన్ 22: నిరుద్యోగులకు రూ.4వేలు భృతి ఇస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి కొర్స రామకృష్ణ డిమాండ్ చేశారు. ములకలపల్లిలో ఆదివారం మండల స్థాయి సర్వసభ